క్లుప్తంగా

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

మారేడుమిల్లి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం మండలంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు పాల్గొంటారని ఆయన చెప్పారు.

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పర్యటన

చింతూరు: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ బుధవారం చింతూరు మండలంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలోని చూటూరులో మధ్యాహ్నం 12 గంటలకు వేగితోట, చూటూరు రహదారి, కారంగూడెంలో 12.30 గంటలకు లక్ష్మీపురం, కారంగూడెం రహదారి నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేయనున్నారు.

శభాష్ వలంటీర్



అనకాపల్లిలో వరలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మడకం లక్ష్మి

కూనవరం: ఆపరేషన్ అనంతరం అనకాపల్లిలో అల్లుడి ఇంటి వద్ద ఉంటున్న జెట్టి వరలక్ష్మి అనే వృద్ధురాలి వద్దకు జగ్గవరం వలంటీర్‌తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ అందజేశారు. ఇటీవల గుంటూరులో వరలక్ష్మి మోకాళ్ల ఆపరేషన్ చేయించుకున్నారు. దీంతో ఆమె అనకాపల్లిలో ఉన్న అల్లుడు ఇంటివద్ద ఉంటున్నారు. ఈనెల 5వ తేదీ పింఛన్‌కు ఆఖరి రోజు కావడంతో వలంటీర్ మడకం లక్ష్మి 350 కిలోమీటర్ల ప్రయాణించి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేసింది. మానవత్వంతో అంతదూరం ప్రయాణించి వెళ్లి పింఛన్ అందజేసిన ఆమెను జగ్గవరం సర్పంచ్ కారం పార్వతి, నందికొండ సత్యనారయణ తదితరులు ప్రశంసించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



రాజవొమ్మంగి కేంద్రం వద్ద పోలీసు అధికారులు

రాజవొమ్మంగి/జి.మాడగుల: కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమబాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంలో మంగళవారం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 274 మంది హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ సలోమి తెలిపారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి ఏడుగురూ పరీక్షకు హాజరయ్యారు. జి.మాడుగుల మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 399 మందికి గాను ఐదు గురు గైర్హాజరు కాగా, 394 మంది పరీక్షలకు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ కె.కె. దొర తెలిపారు.

పోస్టల్ ఖాతాతో భవిష్యత్తుకు బాసట



సోలార్ ప్యానల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఐపీవో ఉపేంద్ర

ముంచంగిపుట్టు: పోస్టల్ శాఖ ఖాతాలు భవిష్యత్తుకు బాసటగా నిలుస్తాయని అరకు సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర తెలిపారు. మండలంలో కరిముఖిపుట్టు,ముంచంగిపుట్టు బ్రాంచ్ పోస్టల్ ఆఫీసులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టల్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే పోస్టల్ పొదుపు ఖాతాలను తెరిచి లబ్ధి పొందాలని,ముఖ్యంగా 10ఏళ్లలోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం తెరిచి భద్రత కల్పించాలని అన్నారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సోలార్ ప్యానల్స్ కోసం పోస్టల్ శాఖను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు. పోస్టల్ ఎంవో శ్రీను పాల్గొన్నారు.

పసుపు రైతుల్లో 'ధర'హాసం



డ్రమ్‌ల్లో ఉడికిస్తున్న పసుపు దుంపలు



జి.మాడుగుల వారపుసంతకు తీసుకొచ్చిన పసుపు కొమ్ములు

జి.మాడుగుల: జిల్లాలో రైతులు పండిస్తున్న పసుపు పంటకు ప్రారంభంలోనే మంచి ధర లభిస్తుండడంతో వారి కళ్లల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటలుగా పసుపు, పిప్పలిమోడి గుర్తింపు పొందాయి. ఇక్కడ సేంద్రియ ఎరువులతో పసుపును పండిస్తారు. పసుపు పంట వేసిన రెండు సంవత్సరాల తరువాత దిగుబడి వస్తుంది. భూమి నుంచి తవ్వి వెలికితీసిన పసుపు దుంపలను నీళ్లలో వేసి ఉడికిస్తారు. ఉడికించిన దుంపలు గట్టిపడే వరకూ ఆరుబయట ఎండలో ఆరబెడతారు. ఇలా సిద్ధం చేసిన కొమ్ములను వారపుసంతలకు తరలించి విక్రయిస్తారు.

పసుపు సాగుకు ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చువుతుంది. ఎకరాకు 1,100 కిలోల వరకు దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. ఎకరా పసుపు పంటపై రైతుకు రూ.50వేలు నుంచి రూ.60వేల వరకు ఆదాయం లభిస్తుంది. గత సవంత్సరం ప్రారంభ ధర కిలోకు రూ.60 ఉండగా. ఈ సంవత్సరం జి.మాడుగులలో మంగళవారం జరిగిన వారపుసంతలో రూ.90 ధరతో రైతులు విక్రయించారు. మంచి ధర లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జి.మాడుగుల మండలంలో 5,769 ఎకరాల్లో నాలుగు వేల మంది రైతులు పసుపు సాగు చేస్తున్నారు. ఈనెలాఖరులోగా సుమారు 50 టన్నుల పసుపు విక్రయించనున్నట్టు రైతులు తెలిపారు.

రూ.30 వరకు ధర పెరిగింది



గిరిజన ప్రాంతాల్లో ఎంతో కష్టించి సేంద్రియ ఎరువులు వినియోగించి పండిస్తున్న పసుపు పంటకు గత రెండేళ్ల గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల నష్టాలు చవిచూశాం. ఈ ఏడాది వారపుసంతల్లో కిలోకు రూ.30వరకు ధర పెరగడంతో రైతులకు ఊరట లభించింది.

–వండ్లాబు దేముళ్లునాయుడు, రైతు, గొడ్డుబూసులు గ్రామం

మరింత పెరిగే అవకాశం



గత సంవత్సరం చాలా తక్కువగా ఉన్న పసుపు ధర, ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే బాగా పెరిగింది. కిలో పసుపును రూ.85 నుంచి రూ.90 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పసుపు ధర మరింత పెరిగే అవకాశం ఉంది.

– బోనంగి చినమత్స్యకొండబాబు, రైతు, గడుతూరు గ్రామం

దిగుబడి బాగుంది



వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది పంట దిగుబడి బాగుంది. వారపుసంతల్లో కొనుగోలు ధర కూడా అనుకూలంగా ఉంది. పసుపు ధర మరింత పెరిగే అవకాశం ఉంది. మండలంలో ఈ సీజన్‌లో 5,769 ఎకరాల్లో పసుపు పంటను వేశారు.

– పాత్రుడు, మండల వ్యవసాయశాఖ అధికారి, జి.మాడుగుల

ఆస్పత్రి అభివృద్ధికి కార్యాచరణ అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో హెచ్‌డీఎస్ కన్వీనర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆస్పత్రిలో ఉన్న సమస్యలు, కావలసిన సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యసేవలు అందించడంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీపీలు బడుగు రమేష్, బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గోమంగిలో మెగా వాలీబాల్ టోర్నీ

పెదబయలు: మండలంలోని గోమంగిలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్టు స్థానిక ఎస్‌ఐ పి.మనోజ్ కుమార్ తెలిపారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

చింతపల్లి తహసీల్దార్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

చింతపల్లిరూరల్: స్థానిక తహసీల్దార్‌గా రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.డీటీ రాజ్‌కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.

రోడ్‌షోను విజయవంతం చేయాలి



ములకనపల్లి పంచాయతీ గొల్ల గూడెంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న నాయకులు

వీఆర్‌పురం: మండల కేంద్రం వీఆర్‌పురం నుంచి చింతరేవుపల్లి వరకు ఈ నెల 6న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిర్వహించే రోడ్డు షోను విజయవంతం చేయాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఆడతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు కోరారు. మండలంలోని పెదమట్టపల్లి,కుందులూరు, ములకనపల్లి, రామవరం,చినమట్టపల్లి తదితర పంచాయతీల్లో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6వతేదీ మధ్యాహ్నం 3.00 గంటల నుంచి వీఆర్ పురం ఆర్చీవద్ద రోడ్డు షో ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు,మాచర్ల గంగులు,బొడ్డు సత్యనారాయణ,చిక్కాల బాలు,మోడెం నరేష్, చీమల కాంతారావు,బంధం రాజు పాల్గొన్నారు.

ఎటపాక: ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబు మండలంలో ఈనెల 10న నిర్వహించనున్న రోడ్‌షోను విజయవంతం చేయాలని నియోజకవర్గ బూత్ కన్వీనర్ తోట రాజేశ్వరరావు,వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు నెల్లిపాక, సాయంత్రం 4గంటలకు తోటపల్లి, 5 గంటలకు గన్నవరంలోని ధర్మయ్య సెంటర్, 6గంటలకు నందిగామలో రోడ్‌షో జరుగుతుందని తెలిపారు.

పారదర్శకంగా పథకాల అమలు



కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం పథకాలను పారదర్శకంగా, సమర్థంగా అమలు చేయాలని స్థానిక ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్ కార్డులు, విశ్వకర్మ రిజిస్ట్రేషన్లపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

122 మందికి వైద్య సేవలు



ఆముదాలబందలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

గంగవరం : స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన ఆధ్వర్యంలో ఆముదాలబంద, రాజంపాలెం గిరిజన గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 122మందికి వైద్య సేవలను అందించి, మందులు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి భావన తెలిపారు. చిన్నారులు, గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. సీహెచ్‌వో మేరీ, ఏఎన్‌ఎం సుబ్బలక్ష్మి, 104 సిబ్బంది పవన్, మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అలంకరణ చేపల పెంపకంపై ముగిసిన శిక్షణ

రంపచోడవరం: కృషి విజ్ఞాన కేంద్రంలో ఐదు రోజుల పాటు అలంకరణ చేపలు పెంపకం, అక్వేరియం తయారీపై ఇచ్చిన శిక్షణ ముగిసింది. శిక్షణ పాల్గొన్న వారికి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ లలితా కామేశ్వరి సర్టిఫికెట్లు అందజేశారు.

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

ముంచంగిపుట్టు: దారెలపంచాయతీ పేటమాలిపుట్టులో మంగళవారం స్థానిక సర్పంచ్ పాండురంగస్వామి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జునలు కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకల్వర్ట్ నిర్మాణానికి రూ.40 లక్షల పీఆర్ నిధులు మంజూరయ్యాయి. వైస్ సర్పంచ్ సావిత్రి పాల్గొన్నారు.

'సోలార్ విద్యుత్'పై విస్తృత ప్రచారం



అవగాహన కల్పిస్తున్న లెక్కల నాయుడు

రాజవొమ్మంగి: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంపై పోస్టల్ శాఖ విస్తృత ప్రచారం చేపట్టింది. పోస్టల్ సూపరింటెండెంట్ లెక్కల నాయుడు మంగళవారం మండలంలోని బడదనాంపల్లిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట పోస్టమాస్టర్ ప్రసాద్, బీపీఎంలు సీతారామరాజు, రమణ ఉన్నారు.

కిచెన్ గార్డెన్ల ఏర్పాటు తప్పనిసరి



విత్తనాలు నాటుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండలానికి మంజూరైన 16 కిచెన్ గార్డెన్‌లను తప్పనిసరిగా సంబంధిత కార్యకర్తలు ఏర్పాటు చేయాలని సీడీపీవో విజయకుమారి ఆదేశించారు. జీవీపాలెం, ధర్మవరం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. కిచెన్ గార్డెన్‌లను పరిశీలించి, విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో కిచెన్ గార్డెన్‌కు రూ.పది వేల చొప్పున మంజూరైనట్టు తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

అరకులోయ రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆ పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. మండలంలో మాడగడ పంచాయతీ బోసుబెడ్డలో మంగళవారం అరకు నియోజకవర్గం ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు చంద్రకళ, అరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శాంతకుమారి,నాయకులు శెట్టి గంగాధరస్వామి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన రహదారి నిర్మాణం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, ఏఈ గణేష్

అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ తలారీపాడు నుంచి రేగం మీదుగా తేనెపుట్టు వరకూ నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డును త్వరితగతిన పూర్తిచేస్తామని ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ గణేష్ తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ రోడ్డు పనులను మంగళవారం జెడ్పీటీసీ గంగరాజుతో కలిసి పరిశీలించి, మాట్లాడారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ శివ, వైస్ సర్పంచ్ అర్జున్, నాగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్టీకమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ శెట్టినీలవేణి

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ శెట్టి నీలవేణి తెలిపారు. రొంపల్లిలో కొలువై ఉన్న గ్రామదేవతను మంగళవారం రాష్ట్ర ఎస్టీకమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మితో కలిసి ఆమె దర్శించుకున్నారు. అనంతరం స్థానిక గిరిజనులతో మమేకమయ్యారు. రొంపల్లి నుంచి పెదరాభ వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తిచేయాలని, సీసీరోడ్లు నిర్మించాలని, బోరుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగజ్యోతి, సర్పంచ్ చిరంజీవి, కో ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మేము సిద్ధంగా ఉన్నామని, వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకుని జగనన్నను రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకొస్తామని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మేము సిద్ధం....మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, మాలన్న, మధు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎల్.కల్యాణం, మాజీ సర్పంచ్ వంజరి సీతారాంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు అంద్రయ్య, పాంగి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పండన్న, చిట్టిబాబు,గబ్బాడి శేఖర్, చంద్రపతి, లక్ష్మీనాయుడు, మత్స్యంనాయుడు,మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి



పథకాల గురించి వివరిస్తున్న శెట్టి అప్పాలు, వైఎస్సార్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌లు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై మండలంలో బస్కి, దేవరపల్లి,బొండగుడ గ్రామాల్లో పార్టీ నాయకులు మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం విజయానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, మాజీ సర్పంచ్ కామరాజు, నాయకులు రామూర్తి, రామరావు, పూర్ణ, రమేష్, మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం



ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

ఎటపాక: ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని ఎటపాక తహసీల్దార్ పృథ్వీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో బూత్‌లెవెల్, రూట్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తగిన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పులుంటే సమాచారం అందజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ కాక కామేశ్వరి, జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి



సెక్టోరియల్ అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

గంగవరం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు పరచాలని తహసీల్దార్ శ్రీమన్నారాయణ సూచించారు. మంగళవారం ఆయన సెక్టోరియల్ అధికారులతో పోలింగ్ కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్‌కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, సిమెంట్ రైలింగ్ (ర్యాంప్‌లు) పరిశీలించి మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌ఐ జిలాబాషా, వ్యవసాయ అధికారి కె.విశ్వనాథ్ ఈవోపీఆర్డీ నరసింగరావు, ఏవో సిద్ధేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

80 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు



గంగవరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గంగవరం : మండల కేంద్రమైన గంగవరంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటా పర్యటించి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు.మంగళవారం హెల్త్ సూపర్ వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం పద్మప్రియ, ఆశా కార్యకర్త రామాయమ్మ... గంగవరం పాత బ్యాంక్ వీధిలో 30 గృహాలను సందర్శించి 80 మందికి సికిల్‌సెల్ ఎనిమీయా పరీక్షలను నిర్వహించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



రైతుల జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: ప్రతి రైతు తాము సాగుచేసిన పంటలను విధిగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏవో ఉమాదేవి తెలిపారు. మర్రివాడ,బూదరాళ్ల సచివాలయాల పరిధిలో ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల వివరాలను గ్రామసభల్లో నిర్ధారించి, ఆర్బీకేల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్బీకేల్లో ప్రదర్శించిన జాబితాల్లో రైతులు తమ వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రివాడ, బూదరాళ్ల వ్యవసాయ సహాయకులు ఎండన్న,సతీష్ పాల్గొన్నారు.

300 మందికి అట్టలు, పెన్నుల పంపిణీ



అట్టలు పంపిణీ చేస్తున్న క్షత్రియ పరిషత్ నేతలు

కొయ్యూరు : నర్సీపట్నానికి చెందిన క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆరు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు చిత్రం ముద్రించిన అట్టలను పంపిణీ చేశారు. వాటితో పాటు కంపస్ బాక్స్‌లు, పెన్నులను అందజేశారు.ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ కార్యదర్శి బుద్ధరాజు చక్రపాణి, ఉపాధ్యక్షులు సత్యనారాయణరాజు, ఎక్జిక్యూటివ్ సభ్యులు జంపన్న, నాగేంద్రరాజు, మంప మాజీ ఎంపీటీసీ బి.శివరామరాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అరకులోయ టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ ఈనెల 8న నిర్వహించే మహిళా దినోత్సవ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.